## క్లుప్తంగా

### అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



మాచర్ల: పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ డి.వేణుబాబు అధ్యక్షతన మాచర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ మదార్ సాహెబ్, వైస్ చైర్మన్ యరాక్రుల సిద్ధమ్మ సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ ప్రతివార్డులో ప్రాధాన్యత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల సహకారం లభిస్తే మరింత వేగంగా అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మత్స్యకారుల కాలనీని సందర్శించిన ఆర్డీఓ



దాచేపల్లి: మండలంలోని రామాపురం గ్రామంలో ఉన్న మత్స్యకారుల కాలనీని గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ గురువారం సందర్శించారు. కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం తరచుగా పెరుగుతుండటంతో ఆర్డీఓ పరిశీలన చేశారు. అనంతరం మత్స్యకారుల కాలనీని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరిగితే నివాస గృహాలను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఆర్ఐ శరత్‌బాబు, వీఆర్వో పోలే జనయ్య తదితరులు ఉన్నారు.

### ఉత్తమ అవార్డు గ్రహీతలకు ఘనసన్మానం



వెల్దుర్తి: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని వెల్దుర్తి మండలంలో పనిచేస్తూ ఉత్తమ అధికారులుగా ఎంపిక కావటం హర్షించదగిన విషయమని ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉత్తమ అధికారులుగా ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీరాంజనేయులు అవార్డు తీసుకోవడం మండలానికి గర్వకారణమన్నారు. ముందురోజుల్లో బాగా పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అధికారులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాజబోయిన మధుసూదనరావు, మందలపు రామకృష్ణ, గుండాల శ్రీనివాసరావు, ముండ్లమూరి కోటయ్య, కంపసాటి కొండలు, మల్లయ్య నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### హెచ్ఐవీపై అవగాహన అవసరం



దాచేపల్లి: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ అనిశెట్టి అరుణ అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులకు గురువారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, పీడితులకు చేతనైనంతలో సాయం చేయాలని ఆమె చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

### కనమర్లపూడిలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో శ్రీ నీలంపాటి అమ్మవారి దేవాలయం 5వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్ళు పొంగించి నూతన వస్త్రాలు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ పూజారి సారధ్యంలో అమ్మవారికి అభిషేకాలు అర్చనలు విశేష పూజలు ఘనంగా చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు పూల దండలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

# దమ్ము చక్రాలతో అధ్వానం

- గ్రామాల్లోని బీటీ రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న దమ్ము చక్రాల ట్రాక్టర్లు
- ఛిద్రమవుతున్న రహదారులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్

పిడుగురాళ్ల రూరల్: పిడుగురాళ్ల రూరల్ మండలంలోని గ్రామాల్లోని రహదారులు దమ్ము చక్రాల వాహనాలతో అధ్వానంగా మారుతున్నాయి. దమ్ము చక్రాల ట్రాక్టర్ల వల్ల బీటీ రోడ్లపై ఏకంగా చిన్నపాటి కాలువల్లా గోతులు ఏర్పడున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల టైర్లు ఆ గోతుల్లోకి వెళ్లి స్లిప్ అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై దమ్ము చక్రాలతో వాహనాలు నడపవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించినప్పటికీ పట్టించుకోకుండా తమ ఇష్టారాజ్యంగా పలువురు వీటిని నడుపుతున్నారు. దీంతో గ్రామీణ రోడ్ల పరిస్థితి దయనీయంగా తయారవుతుంది.

**ప్రభుత్వ నిబంధనలు ఇవి..**

దమ్ము చక్రాలు లేదా ఇనుప చక్రాలు బిగించిన ట్రాక్టర్ తారు రోడ్డు మీద తిరగకూడదు. ఆ విధంగా మొదటిసారిగా పట్టుబడితే రూ.5 వేల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి అదే ట్రాక్టర్ దమ్ము చక్రాలతో నడిపితే సీజ్ చేస్తారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆరు నెలల వరకు జైలు శిక్ష ఉంటుంది. ఇలా నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ గ్రామాల్లో ఎవరూ వాటిని పాటించడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు సైతం మిన్నకుం



దమ్ము చక్రాలతో వెళ్లడంతో పాడైన రోడ్డు

టుండడంతో రోడ్లపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు అనతికాలంలోనే పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రహదారులపై వెళ్లకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**రోడ్లపై యథేచ్ఛగా..**

మండలంలోని అంజనీపురం, పెద్ద అగ్రహారం, జానపాడు గుత్తికొండ, పాత గణేశరపాడు కోనంకి, జూలకల్లు గ్రామాల రోడ్లపై అధికంగా దమ్ము చక్రాల ట్రాక్టర్లను యథేచ్ఛగా నడుపుతున్నారు..అంతే కాకుండా ప్రధాన రహదారులైన బ్రాహ్మణపల్లి మాచవరం రోడ్లపై సైతం నిత్యం ఇవి తిరుగుతూనే ఉన్నాయి... దీంతో రోడ్లపై గీతలు పడుతూ కోసుకుపోతున్నాయి. రోడ్లపై కంకర తేలి గోతులు పడుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు**



పిడుగురాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు బుధవారం పిడుగురాళ్ల పట్టణంలో నల్ల చీరలు, కండువాలు ధరించి సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ హజరత, డి. శాంతమణిలు మాట్లాడుతూ...అంగన్‌వాడీలకు గుదిబండగా మారిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా నిర్వహించాలని, పని చేయని ఫోన్లను వెనక్కి తీసుకొని 5జీ సిమ్‌తో ట్యాబులు, నాణ్యమైన ఫోన్లు వెంటనే ఇవ్వాలని, అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఎటువంటి నిబంధన లేకుండా సంక్షేమ పథకాల అమలు చేయాలని, సామాజిక పెన్షన్ పంపిణీ డ్యూటీ నుంచి అంగన్‌వాడీలను మినహాయింపు ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని వెంటనే అమలు చేయలని, ప్రభుత్వం 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం అమలు చేయాలన్నారు.అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు బ్యాంక్ సెంటర్‌నుంచి పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐలాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీలు జయశ్రీ, శాంతకుమారి, నాగమణి, శైలజ, బుజ్జి, భూలక్ష్మీ, వరలక్ష్మి, సిలోమణి, చౌడేశ్వరి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ అన్నారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గుంటి నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం మున్సిపల్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిలార్ మాట్లాడుతూ టీడీపీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే కార్మికులకు మెరుగైన వేతనాలు ఇస్తామని, పర్మినెంట్ చేస్తామని చెప్పి, నేడు 14నెలలు అవుతున్నా.. మున్సిపల్ కార్మికుల బాధలు పట్టించుకోవటం లేదన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల పనిని అవుట్ సోర్సింగ్ అప్పజెప్పాలనుకోవడం దారుణమన్నారు. అదేవిధంగా ఇంజినీరింగ్ కార్మికులకు సమ్మె సందర్భంగా పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలన్నారు. అదేవిధంగా కార్మికులకు సబ్బులు, నూనెలు, యూనిఫాం, చెప్పులు వెంటనే ఇవ్వాలని, పండగ సెలవులు అమలు చేయలన్నారు. ఎటువంటి నిబంధన లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ అమలు చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, కార్మికులు అంగిడి రామారావు, షేక్ సుభాని, మామిడాల శ్రీను, విజయ్‌బాబు, గుంటి నాగేశ్వరరావు, కాంద్రగుంట యలమంద, కొమర గురవయ్య, బత్తుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరి నారుమళ్లు

- వర్షానికి దెబ్బతిన్న వరి నారుమళ్లు
- నాట్లు ఆలస్యమవుతాయంటున్న రైతులు



లేత వరి నారుమడి



వర్షానికి విత్తనాలు మురిగిపోయి పలుచగా మొలకెత్తిన వరి

రొంపిచర్ల: మండలంలో ముమ్మరంగా వరినారు మళ్లు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సార్వా సీజన్‌లో మండలంలో 41 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేయాల్సి ఉంది. ఈ మొత్తం పొలం సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు దమ్మువరి నారుమళ్ల సాగుపైనే దృష్టి పెట్టారు. అయితే ఇప్పటికే 250 హెక్టార్‌లో వరినారు మళ్లు సాగు ప్రారంభించారు. ఇంకా వరినారుమళ్లు సాగు చేయాల్సి ఉంది. ఎకరా వరిసాగు చేసేందుకు మూడు నుంచి నాలుగు సెంట్ల భూమిలో వరినారు మళ్లు సాగు చేయాల్సి ఉంది. వరినారు మళ్లు సాగు ప్రారంభించి రెండు వారాలు కావస్తుంది. ఆగస్టు రెండోవారం సాగు చేసిన వరి నారుమళ్లకు వాతావరణం పూర్తిగా అనుకూలించింది. మూడవ వారంలో సాగు చేసిన వరినారుమళ్లకు వర్షం కొంత ఇబ్బంది కలిగించటంతో కొంత నారు నష్టపోయారు. దీంతో వరి విత్తనాలు కుళ్లిపోయి నారు పలుచగా మొలిసింది. వర్షానికి దెబ్బతిన్న వరినారుమళ్ల రైతులు అదనంగా నాలుగు రోజుల నుంచి వరినారుమళ్లను సాగు చేస్తున్నారు. ముదురుగా సాగుచేసిన వరినారుమళ్ల వర్షానికి దెబ్బ తినటంతో పది రోజులు ఆలస్యంగా అవసరమైన మేరా తిరిగి వరినారుమళ్ల సాగు ప్రారంభించారు. దీంతో వరినాట్లు సాగు కొంత మేర ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు వెల్లడించారు. కాల్వలకు చివరిలో ఉన్న భూముల్లో వరి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులో వరినారు మళ్లు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రొంపిచర్ల: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఈపాస్ మిషన్‌లోని సమాచారం ప్రకారం గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధిగా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లు రసీదులను తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శివలలిత, తదితర అధికారులు పాల్గొన్నారు.

### షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలు రకాల అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడీ సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని బాబావారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ భక్తులకు అన్నదానం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ధ్వజానికి గ్రామోత్సవం



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ ధ్వజ స్తంభాన్ని గురువారం గ్రామానికి తెచ్చారు. ఈ సందర్భంగా ధ్వజానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో కానుకలు, ప్రసాదాలు అందించారు.

### బంగారు నగల చోరీపై కేసు

నాదెండ్ల: బంగారు నగల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 3వ తేదీన ఈదర శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. నల్లపూసల గొలుసు, చెవిపోగులు కలిపి రూ.1.90 లక్షల విలువైన నగలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ నెల 3న ఈదర శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓ ఫంక్షన్‌కు హాజరై 4న ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వెళ్లి అటు నుంచి చెన్నై వెళ్లాడు. ఆయన తల్లి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి నీకిచ్చిన బంగారు నగలు ఎక్కడ పెట్టావంటూ అడిగింది. దీంతో ఆ నగలు ఇంట్లోని టేబుల్‌పై పెట్టానని సమాధానం ఇవ్వటంతో, నగలు కనబడటం లేదని ఆమె తెలిపింది. ఇంట్లోని సీసీ ఫుటేజీని పరిశీలించగా 3న రాత్రి గుర్తుతెలియని ఇరువురు వ్యక్తులు ఇంట్లోకి వచ్చి బంగారు నగల చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన అవసరం

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన కల్గియుండాలని జిల్లా సంస్థాగత నిర్మాణ మేనేజరు పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మన డబ్బు, మన లెక్కలు మహిళా సంఘాలకు సంబదించిన మొబైల్ యాప్,2.0, లోకోష్ యాప్‌లపై గ్రామసంఘాల వీవోఏలతో, మండల మహిళా సమాఖ్యా ఈసీ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాప్స్ పురోగతి వారం రోజుల వ్యవధిలో నూరుశాతం చేయాలన్నారు. మండలంలోని అన్ని సంఘాల్లోని సభ్యులకు జీవనోపాదులు మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రీకవరి 13 గ్రామ సంఘాల్లో బకాయిలు నిలిచాయని, పెండింగ్‌లో ఉన్న నటు వంటి బకాయిలు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా వీవోఏలు, సీసీలు బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ఏర్పాటు చేసిన లోకోష్ యాప్‌లో సభ్యులు సమగ్ర వివరాలతో పాటు ఆర్థిక లావాదేవీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ, జీవనోపాధుల జిల్లా అధికారి జి.వాసుబాబు, ఎల్‌సీ ముంద్రు బ్రహ్మయ్య, మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి పాల్గొన్నారు.

## మండపాలకు అనుమతులు తప్పనిసరి

**గురజాల సీఐ భాస్కర్**



గురజాల: వినాయక చవితి పండుగ పర్వదినం సందర్భంగా చవితి మండపాల ఏర్పాటుకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ భాస్కర్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారంకాయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. విగ్రహం ఎత్తు 12 అడుగులు మించరాదన్నారు. వినాయకుని మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. నిమజ్జన సమయంలో వీడియో షూటింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మండపం ఏర్పాటుచేసే స్థలంలో ఎటువంటి వివాదం ఉండకూడదని, మతాలకు సంబంధించిన ఘర్షణలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిమజ్జన వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనరాదని, నిమజ్జన సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఉండకూడదన్నారు. డీజేకి పర్మిషన్ లేదన్నారు. ముందుగానే నిమజ్జనం రూటును పోలీసులకు తెలపాలని, బాణసంచా కాల్చరాదని తెలిపారు.

కారెంపూడి: ఈ నెల 27వ తేదీ వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న చవితి ఉత్సవ మండపాలకు అనుమతులు తప్పక తీసుకోవాలని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు కోరారు. పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోడానికి అందరూ సహకరించాలన్నారు. ప్రతి మండపం ఏర్పాటుకు ముందుగా విద్యుత్తు శాఖ, గ్రామ పంచాయతీ, అగ్నిమాపక శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే పోలీస్ శాఖ అనుమతికి మీ సేవ కేంద్రంలో కానీ, పోలీస్ స్టేషన్‌లో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్ఐ వాసు పాల్గొన్నారు.

## ప్రమాదం అంచున మత్స్యకారుల కాలనీ



మత్స్యకారుల కాలనీని ఆనుకొని ప్రవహిస్తున్న కృష్ణానది వరద నీరు

- కాలనీని ఆనుకుని ప్రవహిస్తున్న కృష్ణానది వరద
- ఇళ్లను ఖాళీ చేసి మత్స్యకారులను పునరావాస కేంద్రానికి తరలింపు



ట్రాక్టర్ ద్వారా సామగ్రిని తరలిస్తున్న మత్స్యకారులు

దాచేపల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీని ఆనుకుని గురువారం వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో మత్స్యకారులను అక్కడి నుంచి ఖాళీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కాలనీలో 50 గృహాల్లో నివాసం ఉంటున్న మత్స్యకారులు ఇళ్లలోని సామగ్రిని సర్దుకొని ట్రాక్టర్లు, ఆటోల ద్వారా పునరావాస కేంద్రానికి తరలివెళుతున్నారు. స్థానిక హైస్కూల్లో వీరికి పునరావాస కేంద్రం ఏర్పాటు చేయటంతో అక్కడికి తరలి వెళ్లారు. ఇళ్లల్లోని సామగ్రినంతటిని సర్దుకొని అక్కడకు వీరు వెళ్లి ఉంటున్నారు. పునరావాస కేంద్రంలో వీరికి అన్ని ఏర్పాట్లు చేశారు. కృష్ణా నదిలో వరద నీరు వచ్చిన ప్రతిసారి తాము ఇళ్లను ఖాళీ చేసి పునరావస కేంద్రానికి వెళ్ళటం బాధగా ఉందని, ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాలని మత్స్యకారులు కోరుతున్నారు. గత పది రోజులుగా నదిలో వేటకు వెళ్లకుండా ఉండటంతో ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నమైందన్నారు. దీంతో ఆర్థికపరమైన ఇబ్బందులతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

**ఇద్దరికి గాయాలు**



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పిడుగురాళ్ల: కారు టైర్ పంక్చరై ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని అయ్యప్ప నగర్ కాలువ వద్ద గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దాచేపల్లి వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వేగంగా కారు వస్తుంది. ఇదే సమయంలో మాచవరం మండలం వెల్లంపల్లి గ్రామంలో చేపలు పట్టే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో కారు టైర్ పంక్చరై ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో ఆ ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాలలోకి దూసుకొని వెళ్లింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పట్టణ ఎస్ఐ మోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

రెంటచింతల: మండలంలోని మల్లవరం, గోలి, మంచికల్లు, తుమృకోట, పాలువాయి, పశర్లపాడు, సత్రశాల గ్రామాల్లో గురువారం విజిలెన్స్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ బి.విజయకృష్ణ, పల్నాడు సర్కిల్ ఆపరేషన్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ విజయకుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో మొత్తం 55 మంది అధికారులు, 165 మంది సిబ్బంది కలిసి 55 బృందాలు ఏర్పడి ఆయా గ్రామాలలో 4,832 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన, మీటర్ ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిలో విద్యుత్ వినియోగించిన, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వినియోగించుకుంటున్న తదితర మొత్తం 76 మందిపై కేసులు నమోదుచేసి వారి వద్ద నుంచి రూ. 2.94 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

వినాయక చవితి పండుగ సందర్భంగా డెకరేషన్ లైటింగ్ కోసం ఉపయోగించే విద్యుత్ లోడును విద్యుత్ శాఖ అధికారులకు ముందుగా తెలియచేసి లోడుకు తగు సమానంగా డీడీ రూపేణా చెల్లించి తాత్కాలికంగా విద్యుత్ సరఫరా పొందాలని కోరారు. డీడీ చెల్లించకుండా విద్యుత్ వినియోగించిన వారిపై శాఖాపరమైన కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీఈఈలు కె.రవికుమార్, ఎన్.మల్లిఖార్జునరావు, ఎస్.శ్రీనివాసరావు, టి.వీరేశ్వరరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ ఎస్‌కే మస్తాన్‌వలి, ఆపరేషన్ డీఈఈలు ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.